సాక్షి
తూర్పుగోదావరి
బుధవారం । 8 । జనవరి । 2025



ప్రభుత్వ విద్యను రక్షించుకోవాలి

విద్యారంగాన్ని బతికించుకోవడానికి మరింత కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ పిలుపునిచ్చారు.


II లో



కోటసత్తెమ్మ తల్లికి వెండి పళ్లెం

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారికి యేరుకొండ సూర్యనారాయణ, కనకదుర్గ దంపతులు (రాజమహేంద్రవరం) 760 గ్రాముల వెండి పళ్లెం అందజేశారు.

డెల్టాలకు 12,810 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 12,810 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,780, మధ్య డెల్టాకు 2,460, పశ్చిమ డెల్టాకు 6,570 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

జిల్లాలో రూ.125 కోట్ల స్త్రీనిధి రుణాలు



స్త్రీనిధి గురించి వివరిస్తున్న ధర్మేంద్ర

పెరవలి: జిల్లాలో స్త్రీనిధి ద్వారా 22 వేల మందికి రూ.125 కోట్ల మేర రుణాలు అందించామని ఏజీఎం ఎం.ధర్మేంద్ర తెలిపారు. పెరవలి వెలుగు కార్యాలయానికి మంగళవారం వచ్చిన ఆయన స్త్రీనిధి రుణాలు, వసూళ్లపై రికార్డులు పరిశీలించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్త్రీనిధి రుణాలు తీసుకున్న డ్వాక్రా గ్రూపులు జిల్లాలో 33 వేలు ఉన్నాయన్నారు. వీటిలో రుణాలు తీసుకున్న సభ్యులు 22 వేల మంది ఉన్నారని చెప్పారు. స్త్రీనిధి రుణాల చెల్లింపు 99 శాతంగా ఉందన్నారు. స్త్రీనిధి రుణాలు సక్రమంగా చెల్లిస్తున్న సభ్యులకు రుణ పరిమితి పెంచేందుకు ప్రభుత్వం అనుమతించిందని తెలిపారు. ఒక్కో సభ్యురాలు రూ.5 లక్షల వరకూ రుణం తీసుకోవచ్చని, దీనిని 23 వాయిదాల్లో సక్రమంగా చెల్లిస్తే కేవలం 11 శాతం వడ్డీ పడుతుందని వివరించారు. అంతే కాకుండా బ్యాంక్ లింకేజీ ద్వారా మరో రూ.2 లక్షల రుణం పొందవచ్చని తెలిపారు. ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేసుకుంటే మరో రూ.10 లక్షల రుణం కూడా లభిస్తుందని చెప్పారు. పెరవలి మండలంలో 1,333 మంది సభ్యులు రూ.7.78 లక్షల మేర స్త్రీనిధి రుణాలు తీసుకున్నారని, అందరూ సకాలంలో తిరిగి చెల్లిస్తున్నారని ధర్మేంద్ర తెలిపారు. కార్యక్రమంలో స్త్రీనిధి జిల్లా మేనేజర్ ఎం.రత్నకుమారి, ఏపీఎం బి.రామకృష్ణ, సీసీ కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీలు



విజేతలతో డైట్ ప్రిన్సిపాల్ జయశ్రీ, న్యాయనిర్ణేతలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయిలో విద్యార్థులకు ఎనిమిది అంశాల్లో మంగళవారం రంగోత్సవ్ పోటీలు నిర్వహించారు. క్విజ్‌లో బి.అక్షయ దీపిక (శాటిలైట్ సిటీ జెడ్పీ హైస్కూల్), చిత్రలేఖనంలో జి.సాయి వేదస్వి (కాతేరు తిరుమల పాఠశాల), హ్యాండ్ రైటింగ్ పోటీలో ఎం.తనిష్క (శ్రీ గౌతమి పాఠశాల), రంగోలీ పోటీల్లో కె.సాయిసుధ, కె.నంజన, వి.దుర్గ టీమ్ (కాకినాడ సాలిపేట మున్సిపల్ ఉన్నత పాఠశాల), జానపద నృత్యంలో కె.హిమవర్షి (రాజమహేంద్రవరం ఓఎన్‌జీసీ కేంద్రీయ విద్యాలయం), డిజిటల్ కొలేజ్ విభాగంలో ఎస్.యోగి సత్య ప్రియాంక (కడియం జెడ్పీ హైస్కూల్), స్లోగన్స్ విభాగంలో జి.లలిత (శాటిలైట్ సిటీ జెడ్పీ హైస్కూల్) ప్రథమ స్థానాలు సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ వివరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన అందరికీ సర్టిఫికెట్లు, నగదు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా జోగన్నశాస్త్రి, రాజు, సూర్యనారాయణ, జానకీదేవి, చూడామణి, గంగాధర్, రాజేష్, భవానీ వ్యవహరించారు.

డిమాండ్ల సాధనకు దశల వారీ ఉద్యమం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ స్టేట్ అగ్రికల్చరల్ కో ఆపరేటివ్ సొసైటీ యూనియన్ ఆధ్వర్యాన ఉద్యోగులు బుధవారం నుంచి దశల వారీ ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నారు. యూనియన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు టి.వెంకటరామయ్య, ట్రెజరర్ పి.సత్యనారాయణ మంగళవారం విలేకర్లకు ఈ విషయం తెలిపారు. బుధవారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని, 9న పార్లర్ రన్‌తోపాటు అన్ని కంప్యూటర్ పనులు నిలుపు చేస్తామని, 10న డీసీసీబీ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని వివరించారు. ఈ నెల 20న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, 27న విజయవాడలోని రాష్ట్ర సహకార బ్యాంకు వద్ద మహా ధర్నా చేపడతామన్నారు. వచ్చే నెల 10వ తేదీలోగా సమస్య పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె చేయనున్నామని చెప్పారు. ఉద్యోగుల వయో పరిమితి పెంపు, వేతన సవరణ, రెగ్యులర్ చేయడం, చట్ట ప్రకారం గ్రాట్యుటీ అమలు, ఆడిట్ డ్యుయల్ పద్ధతి రద్దు, సహకార సంఘాలకు ఆదాయ పన్ను మినహాయింపు, షేర్ ధనంపై డివిడెండ్ చెల్లింపు, షేరు ధనంలో సంఘాలకు వాటా కల్పించడం వంటి డిమాండ్లతో పాటు సహకార రంగాన్ని ప్రైవేటు పరం చేయవద్దని కోరుతూ ఈ ఆందోళనలు చేస్తున్నామని వివరించారు.

కళ్లప్పగించేలా..

ఒళ్లు గగుర్పొడిచేలా..

- ఆబోతుల భీకరపోరు
- స్థానికుల బెంబేలు

కాజులూరు: సంక్రాంతి సమీపిస్తోందంటే గ్రామాల్లో కోడిపుంజులు పందేలకు కాలుదువ్వుతుంటాయి. కోర్టులు వద్దని చెబుతున్నా, పోలీసులు దాడులుచేసి కేసులు పెడతామని బెదిరిస్తున్నా ఏదో ఒక పక్క పందేలు వేసేవారు వేస్తుంటారు. వాటిని చూడటానికి వెళ్లేవారు వెళుతుంటారు. అయితే కాజులూరు మండలం గొల్లపాలెంలో సోమవారం రెండు ఆబోతులు భీకరంగా తలపడగా స్థానికులు కళ్లప్పగించి తిలకించారు. కాకినాడ, కోటిపల్లి రహదారిపై పోటీకి దిగిన ఆబోతులు సుమారు అర్ధగంటసేపు ఆగకుండా పోట్లాడుకోవడంతో స్థానికులు, ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. కర్రలతో బెదిరించినప్పటికీ అవి పట్టు వీడలేదు. రహదారిపై ఇరువైపులా కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. కొమ్ముల నుంచి రక్తం కారటంతో స్థానికులు బకెట్లతో ఎద్దులపై నీళ్లు చల్లి వాటిని శాంతింపజేశారు.



గొల్లపాలెంలో భీకరంగా పోట్లాడుకుంటున్న ఆబోతులు

కొవ్వూరులో టీడీపీ

- కత్తులు దూస్తున్న రెండు వర్గాలు
- రాజీవ్‌కృష్ణ వర్గం బలపడితే తమకు ప్రాధాన్యం ఉండదని భావిస్తున్న మరో గ్రూపు
- వేర్వేరుగా పార్టీ కార్యక్రమాలు
- లోకేష్ వద్దకు పంచాయితీ
- సయోధ్య కుదిర్చే బాధ్యత ఉత్తరాంధ్ర నేతకు..
- ససేమిరా అంటున్న ఇరు వర్గాలు



సాక్షి, రాజమహేంద్రవరం: అధికార టీడీపీ నేతలు కొవ్వూరులో ఢీ అంటే ఢీ అంటున్నారు. మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్, ద్విసభ్య కమిటీ సభ్యుల మధ్య ఇప్పటికే తీవ్ర స్థాయిలో విభేదాలున్న సంగతి తెలిసిందే. దివంగత ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు అల్లుడు రాజీవ్‌కృష్ణ, ఆయన వర్గీయులు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సమక్షంలో కొన్నాళ్ల కిందట టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఆ పార్టీలో వర్గ విభేదాలు మరింతగా భగ్గుమంటున్నాయి. రాజీవ్‌కృష్ణ చేరికపై అగ్గి మీద గుగ్గిలమైన ఆయన వ్యతిరేక వర్గం ఇటీవల ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఎదుట ఆందోళనకు దిగింది. రాజీవ్‌కృష్ణ చేరికను జవహర్ వర్గం స్వాగతిస్తూంటే.. ద్విసభ్య కమిటీలోని ఓ సభ్యుడి వర్గం వ్యతిరేకిస్తోంది.

విభేదాలు లేవంటూనే..

కొవ్వూరు టీడీపీలో గ్రూపు విభేదాల 'పంచాయితీ కాస్తా' ప్రస్తుతం లోకేష్ వద్దకు చేరింది. ఆయన జోక్యం చేసుకున్నా విభేదాల అగ్గి మాత్రం చల్లారడం లేదు. ఎవరికి వారే అన్నట్లుగా పార్టీ కార్యక్రమాలు వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు ఉత్తరాంధ్రకు చెందిన ఓ టీడీపీ ముఖ్య నేతను రంగంలోకి దింపారు. ఆయన ఇరు వర్గాలతో ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపినట్లు తెలిసింది. అయితే, అచ్చిబాబు, ఆయన వర్గీయులు మాత్రం పార్టీలో ఎలాంటి విభేదాలూ లేవని, రాజీవ్‌కృష్ణ చేరికతో తమకు ఎలాంటి ఇబ్బందీ లేదని చెప్పినట్లు సమాచారం.

పైకి అలా చెబుతూనే లోలోపల మాత్రం రాజీవ్ వర్గాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిసింది. లోకేష్ ఆదేశాలను సైతం లెక్క చేయకుండా వర్గాలు విడిపోవడంపై అధిష్టానం గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. పార్టీలో చేరిన వారిని కలుపుకోలేకపోతూండటంపై లోకేష్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారం దేనికి దారి తీస్తుందోనని నియోజకవర్గ నేతలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

రాజీవ్‌కృష్ణ చేరిక వలన పార్టీలో తన ఆధిపత్యానికి చెక్ పడుతుందనే భావనతోనే ఇలా వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం.

మామా అల్లుళ్ల సవాల్?

రాజీవ్‌కృష్ణ దివంగత ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు అల్లుడు. కాగా, కృష్ణబాబు సోదరుడైన ఆంధ్రా సుగర్స్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్చిబాబు కొవ్వూరులో టీడీపీకి పెద్ద దిక్కుగా ఉన్నారు. ఆయనకు అధిష్టానం వద్ద మంచి పేరుంది. తాను ఎవరికి చెబితే వారికి ఎమ్మెల్యే టికెట్ వచ్చేలా పావులు కదపడంలో దిట్ట. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో సైతం మాజీ మంత్రి జవహర్‌కు కాకుండా ఎవరికి ఇచ్చినా అభ్యంతరం లేదని పట్టుబట్టారు. దీంతో, అధిష్టానం గోపాలపురం నియోజకవర్గానికి చెందిన ముప్పిడి వెంకటేశ్వరావుకు ఎమ్మెల్యే అభ్యర్థిత్వం ఖరారు చేసింది. అంత పట్టున్న తనకు కనీస సమాచారం ఇవ్వకుండా.. విశాఖ ఎంపీ భరత్ నేతృత్వంలో రాజీవ్‌కృష్ణ టీడీపీలో చేరడంపై ఆయన చినమామ అయిన అచ్చిబాబు అసంతృప్తితో ఉన్నారని తెలిసింది. దీనికితోడు జవహర్ వర్గాన్ని దగ్గరకు తీస్తూండటం కూడా ఆయనకు మింగుడు పడటం లేదు. ఈ కారణంతోనే రాజీవ్‌కృష్ణ చేరిక సమయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, పెండ్యాల అచ్చిబాబు దూరంగా ఉన్నారని అంటారు.

ద్విసభ్య కమిటీలో చీలిక?

మాజీ మంత్రి జవహర్, సీనియర్ నేత పెండ్యాల అచ్చిబాబు వర్గాల మధ్య విభేదాలను చల్లార్చేందుకు టీడీపీ అధిష్టానం గతంలో ద్విసభ్య కమిటీ ఏర్పాటు చేసింది. జవహర్ వర్గం నుంచి జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, పెండ్యాల అచ్చిబాబు వర్గం నుంచి కంఠమణి శివరామకృష్ణ ఇందులో సభ్యులుగా ఉన్నారు. ప్రస్తుతం ఈ కమిటీ రెండుగా చీలిపోయింది. మరో వర్గం నేతల వ్యవహార శైలి నచ్చకపోవడంతో జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి సైలెంట్ అయ్యారు. పార్టీ కార్యక్రమాల్లో సైతం అంటీ ముట్టనట్లుగా ఉంటున్నారు. దీంతో ద్విసభ్య కమిటీ కాస్తా ఏకసభ్య కమిటీగా మారిపోయింది. మరో సభ్యుడైన కంఠమణి రామకృష్ణ నేతృత్వంలోని ఏకసభ్య కమిటీ మాత్రమే ప్రస్తుతం పార్టీ వ్యవహారాలు చూస్తోంది. అది కూడా ఎమ్మెల్యేని సైతం పక్కన పెట్టేసి, అన్నీ తామై వ్యవహరిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారం ఎమ్మెల్యేకి సైతం తలనొప్పిగా మారిందని, చేసేది లేక మిన్నకుండిపోతున్నారని సమాచారం.

అందుకే వ్యతిరేకిస్తున్నారా?

నియోజకవర్గంలో రాజీవ్‌కృష్ణ బలపడితే తమకు ప్రాధాన్యం దక్కదని, తమ ఇసుక, ఇతర వ్యాపారాలకు గండి పడుతుందని భావిస్తున్న వర్గం మాత్రమే ఆయనను వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. త్వరలో నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందనే చర్చ విస్తృతమవుతోంది. అదే జరిగితే కొవ్వూరు నియోజకవర్గం ప్రస్తుతం ఉన్న ఎస్సీ నుంచి జనరల్‌గా మారే అవకాశం ఉందని అంటున్నారు. అప్పుడు ఎమ్మెల్యే అభ్యర్థిత్వం రాజీవ్‌కృష్ణ కుటుంబానికే దక్కుతుందనే ప్రచారం జోరందుకుంది. ఒకవేళ అలాగే జరిగితే నియోజకవర్గం తమ చేతి నుంచి జారిపోతుందనే భావనలో కంఠమణి వర్గం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీనికి తగినట్లు రాజీవ్‌కృష్ణకు మద్దతుగా ఇటీవల న్యూ ఇయర్, సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ పెద్ద బ్యానర్లు దర్శనమిచ్చాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

- ఆకట్టుకున్న ఫ్యాషన్ షో, బాడీ బిల్డింగ్ ప్రదర్శనలు
- రెండో రోజు ప్రజాఉత్సవాలు



అలరించిన ఫ్యాషన్ షో

యానాం: యానాం ప్రజాఉత్సవాలలో భాగంగా రెండోరోజు మంగళవారం స్థానిక బాలయోగి స్టేడియంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా మిస్ ఫెమినా కంటెస్టెంట్ డిజైనర్స్ నిర్వహించిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. వివిధ రకాల డ్రెస్‌లతో వేదికపై నిర్వహించిన ఫ్యాషన్‌షోలో కోల్‌కతా తదితర ప్రాంతాలకు చెందిన ఫెమినా డిజైనర్స్ పాల్గొన్నారు. అనంతరం సోనీ టెలివిజన్ షోలో విజేతలుగా నిలిచిన టీనేజర్స్ క్రూ టీమ్ తమ విభిన్న రీతుల్లో చేసిన నృత్యాలు, ఇండియా గాట్ టాలెంట్ విన్నర్స్ టీనేజర్స్ క్రూ టీమ్‌ల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో రష్యన్ యువతులు ప్రదర్శించిన డ్యాన్స్, ఇండియన్ మైండ్ రీడింగ్ ఆర్టిస్ట్ సుదర్శన్ ప్రదర్శన ఆహుతులను అలరించింది. అనంతరం బాడీబిల్డింగ్ షోలో పలువురు యువకులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. తెలుగు సంప్రదాయ పండుగల ఈవెంట్‌లు, స్థానిక యువకుల పాశ్చాత్యశైలి నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొన్నారు.



టీవీ కళాకారుల ప్రదర్శన

మరింత రుచిగా ప్రసాదం

- ఈఓ సుబ్బారావు ఆదేశం
- సత్యదేవుని ప్రసాదం తయారీ విభాగంలో ఆకస్మిక తనిఖీ
- నేతి కొనుగోళ్లపై ఆరా

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో గోధుమ నూక ప్రసాదాన్ని మరింత రుచిగా, శుచిగా, భక్తులందరూ సంతృప్తి చెందేలా తయారు చేయాలని అన్నవరం ఆ విభాగం అధికారులను దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు ఆదేశించారు.

సత్యదేవుని ప్రసాదం తయారీలో ఉపయోగించే నేతిని టెండర్ ద్వారా కాకుండా సహకార డెయిరీల నుంచి కొనుగోలు చేయడం వలన దేవస్థానానికి రూ.67 లక్షల అదనపు భారం పడిన విషయాన్ని 'నేతి చమురు వదిలిపోతోంది' శీర్షికన సాక్షి దినపత్రిక సోమవారం వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఈఓ సుబ్బారావు మంగళవారం ప్రసాదం తయారీ విభాగాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేడి ప్రసాదాన్ని రుచి చూశారు. ప్రసాదం తయారీలో వాడే దినుసుల కొనుగోలుపై పీఆర్ఓ కృష్ణారావు, సూపరింటెండెంట్ భాస్కర్ తదితరులను అడిగి తెలుసుకున్నారు. ప్రసాదం తయారీకి అవసరమైన గోధుమ నూక, పంచదార, యాలకులు టెండర్ ద్వారా కొనుగోలు చేస్తున్నామని, నెయ్యి మాత్రం ప్రభుత్వ ఆదేశాల మేరకు సంగం డెయిరీ నుంచి కొంటున్నామని వారు చెప్పారు. ఒక కళాయిలో 15 కిలోల గోధుమ నూక, 30 కిలోల పంచదార, ఆరు కేజీల నెయ్యి, 200 గ్రాముల యాలకులు, తగినంత నీటితో సుమారు 80 కేజీల ప్రసాదం తయారవుతుందని వివరించారు. ఒక కళాయి ప్రసాదంతో 150 గ్రాముల ప్రసాదం ప్యాకెట్లు 533 తయారవుతాయని తెలిపారు. ఒక్కో ప్యాకెట్టును రూ.20కి విక్రయిస్తున్నామని, రోజుకు 60 నుంచి 70 కళాయిల ప్రసాదం తయారు చేస్తున్నామని చెప్పారు. సాధారణ రోజుల్లో తెల్లవారుజామున 5 గంటల నుంచి, కార్తిక మాసం వంటి పర్వదినాల్లో అర్ధరాత్రి నుంచి ప్రసాదం తయారు చేస్తామన్నారు. నిల్వ ఉండే బంగీ ప్రసాదం కూడా తయారు చేస్తామని, అయితే గోధుమ నూక ప్రసాదాలతో పోల్చితే దీని తయారీ 5 శాతం మాత్రమే ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ఈఓ సుబ్బారావు మాట్లాడుతూ, నెయ్యి మినహా మిగిలిన దినుసులను టెండర్ ద్వారా కొనుగోలు చేస్తున్నామని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నేతిని సంగం డెయిరీ నుంచి కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ఇకపై తరచూ ప్రసాదం విభాగాన్ని సందర్శిస్తానని అన్నారు.



ప్రసాద తయారీ సిబ్బంది, వంటస్వాములతో మాట్లాడుతున్న ఈఓ సుబ్బారావు

ఉత్తరాది భక్తజన వాహిని

- రత్నగిరికి ఏటా శీతాకాలంలో రాక
- టూరిస్టు బస్సులలోనే వేల కిలోమీటర్ల ప్రయాణం
- సొంతంగా వంటలు
- బస్సు వద్దనే బస
- సత్యదేవుని సన్నిధిలో సందడి చేస్తున్న భక్తులు



భక్తుల కోసం కొండ దిగువన కళాశాల మైదానంలో దేవస్థానం నిర్మించిన షెడ్లు



బస్సుల వద్దనే వంటలు చేసుకుంటున్న ఉత్తరాది భక్తులు

అన్నవరం: అయోధ్యలో బాలరాముడి దర్శనానికో.. కాశీ విశ్వనాథుని సన్నిధానానికో.. చార్‌ధామ్ యాత్రకో దక్షిణాది రాష్ట్రాల నుంచి భక్తులు ఉత్తర భారత్‌కు పోటెత్తడం సహజం. కానీ, ఉత్తరాదికి చెందిన భక్తులు దక్షిణ భారత్‌కు.. అందునా భక్తవరదుడైన సత్యదేవుని సన్నిధికి ప్రస్తుతం వేలాదిగా తరలి వస్తున్నారు. సాధారణంగా ఉత్తరాది రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్థాన్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తర ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో వ్యవసాయ పనులు డిసెంబర్‌లో పూర్తవుతూంటాయి. దీంతో, అక్కడి భక్తులు ఇదే సమయంలో తీర్థయాత్రలకు శ్రీకారం చుడతారు. ఈవిధంగా డిసెంబర్‌లోనే అన్నవరం సత్యదేవుని సన్నిధికి వారి రాక ఆరంభమైంది. ఈ నెలలో వారి సందడి మరింత పెరిగింది. రెండు వారాల నుంచి వందలాది టూరిస్టు బస్సులలో వేలాదిగా ఉత్తరాది భక్తులు అన్నవరం తరలివస్తున్నారు. వారు వస్తున్న బస్సులతో కొండ దిగువన ఉన్న కళాశాల మైదానం నిండిపోతోంది. ఎక్కువగా మధ్య తరగతికి చెందిన మధ్య వయస్కులే ఈ యాత్రలు చేస్తూండటం విశేషం.

సమూహాలుగా..

గతంలో భక్తులందరూ టూరిస్టు బస్సులలోనే తీర్థయాత్రలు చేసేవారు. కానీ, ఇప్పుడు రైళ్లు, కార్లలో యాత్రలు చేస్తున్నవారే అధికంగా కనిపిస్తున్నారు. కానీ, ఉత్తరాది భక్తులు మాత్రం ఇప్పటికీ సమూహాలుగా టూరిస్టు బస్సులలోనే యాత్రలు చేస్తూండటం విశేషం. వేలాది కిలోమీటర్లు బస్సులలోనే ప్రయాణించడం వీరి ప్రత్యేకత. కనీసం పది బస్సులకు తక్కువ కాకుండా గరిష్టంగా 50 బస్సులలో కూడా భక్తులు వచ్చిన సందర్భాలున్నాయి. వీరు తమ బస్సులను గతంలో రత్నగిరిపై నిలుపు చేసి సత్యదేవుని దర్శనానికి వెళ్లేవారు. అయితే కొన్నాళ్లుగా కొండ దిగువన కాలేజీ మైదానంలో దేవస్థానం అన్ని వసతులూ కల్పించడంతో వీరు అక్కడే తమ బస్సులు నిలుపు చేసి, సత్యదేవుని దర్శించుకుంటున్నారు. ఉత్తరాది భక్తుల్లో ఎక్కువ మంది కొండ దిగువ నుంచి కాలి నడకనే సత్యదేవుని ఆలయానికి వెళ్లి, తిరిగి తమ బస్సుల వద్దకు చేరుకుంటున్నారు. పంపా ఘాట్‌లో స్నానం చేసి, ఘాట్ రోడ్డు మీదుగా నడుస్తూ ఆలయానికి వెళ్లే వారే ఎక్కువగా కనిపిస్తున్నారు.

సొంత వంట

సాధారణ భక్తులతో పోలిస్తే ఉత్తరాది భక్తుల వ్యవహార శైలి భిన్నంగా కనిపిస్తూంటుంది. వీరు వంట సామగ్రి, పొయ్యలు, గ్యాస్ సిలిండర్లు కూడా తమ వెంట తెచ్చుకుంటారు. బస్సులను నిలుపు చేసిన చోటే వంటలు చేసుకుని, సామూహికంగా భోజనాలు చేస్తూంటారు. బయట ఎక్కడా హోటళ్లలో కొనుక్కుని తినరు. ఫలహారమైనా, చపాతీలైనా, పూరీలైనా వండుకోవల్సిందే. ప్రతి బస్సులో ఒక వంట మేస్త్రి, ఇద్దరు సహాయకులు ఉంటారు. వీరికి మరి కొంత మంది భక్తులు సహాయం చేస్తారు. ఎక్కువగా చపాతీలు, పూరీలు, టమాటా – బంగాళాదుంప కూర వండుకుంటూంటారు. అవసరమైన గోధుమ పిండి, నూనె, బంగాళా దుంపలు, టమాటాలు, ఇతర కూరగాయలు వెంట తెచ్చుకుంటారు. అవి అయిపోతే స్థానికంగా కొనుక్కుంటారు. అందరూ వరుసగా కూర్చుని తింటూంటారు. దగ్గరలో సత్రాలుంటే వాటిలో హాల్స్ అద్దెకు తీసుకుని బస చేస్తారు. ఒకవేళ సత్రాలు లేకపోతే బస్సుల వద్దనే విశ్రమించడం వీరికి అలవాటు. చివరకు ధరించే వస్త్రాలు కూడా బస చేసిన చోటనే ఉతుక్కుని ఆరబెట్టుకుంటారు. అన్నవరానికి ఈ నెలాఖరు వరకూ ఉత్తరాది భక్తుల యాత్ర కొనసాగనుంది.



కొండ దిగువన కళాశాల మైదానంలో నిలిపిన ఉత్తరాది భక్తుల బస్సులు

ఉపయోగపడుతున్న విశ్రాంతి షెడ్లు

టూరిస్టు బస్సులలో వస్తున్న భక్తుల కోసం కళాశాల మైదానంలో దేవస్థానం గతంలో విశ్రాంతి షెడ్లు నిర్మించింది. మొత్తం ఐదు విశ్రాంతి షెడ్లు, ఒక వంట చేసుకునే షెడ్డును 2023లో అప్పటి ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ హయాంలో నిర్మించారు. వీటిలో అవసరమైన వసతులను గత ఏడాది నాటి ఈఓ కె.రామచంద్ర మోహన్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ షెడ్లు ఈ భక్తులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 – 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,800
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

వ్యక్తి దుర్మరణం



లక్ష్మణరావు (ఫైల్)

గోపాలపురం: మొక్క జొన్న మెషీన్ తలపై పడి వ్యక్తి మృతిచెందినట్టు గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ తెలిపారు. మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన పాట్రా లక్ష్మణరావు మంగళవారం మొక్కజొన్న ఆడే మెషీన్‌తో రోడ్డు మీద వెళుతుండగా ఒక్కసారిగా ప్రమాదవశాత్తూ కాలు జారి మెషీన్ తలపై పడటంతో లక్ష్మణరావు(42) మృతిచెందినట్టు తెలిపారు. మృతుడి భార్య మల్లేశ్వరి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

గ్రూప్ డ్యాన్స్ పోటీలు

తుని రూరల్: సంక్రాంతి సందర్భంగా ఈ నెల 14న ఉమ్మడి తూర్పు గోదావరి, విశాఖ జిల్లాల స్థాయి గ్రూప్ డ్యాన్స్ పోటీలు ఏర్పాటు చేసినట్టు మాజీ ఎంపీపీ పోల్నాటి శేషగిరిరావు తెలిపారు. తుని మండలం టి.తిమ్మాపురంలో నిర్వహించే ఈ పోటీలు మహావిష్ణు అన్నదానం, కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుపుతున్నట్టు చెప్పారు. ప్రథమ బహుమతి రూ.12వేలు, ద్వితీయ రూ.ఎనిమిది వేలు, తృతీయ బహుమతి రూ.ఐదువేలు, రెండు గ్రూపులకు కన్సోలేషన్ బహుమతులుగా రూ.వెయ్యి చొప్పున ఇస్తామన్నారు. 90598 11116, 85208 49993 నంబర్లకు ఫోన్ చేసి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

ప్రభుత్వ విద్యను రక్షించుకోవాలి

- యూటీఎఫ్ 17వ స్వర్ణోత్సవ సభలో వక్తల పిలుపు
- 3వ రోజూ కొనసాగిన మహాసభలు



సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ, హాజరైన ప్రతినిధులు



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యారంగాన్ని బతికించుకోవడానికి అందరూ మరింత కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ పిలుపునిచ్చారు. యూటీఎఫ్ 17వ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక స్వర్ణోత్సవ మహాసభలు కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో మూడోరోజు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రతినిధుల ప్రారంభ సభ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ సమాన భావజాల వ్యాప్తి జరిగితేనే మనం అనుకున్న విద్యా విధానం అమలుచేయగలమని చెప్పారు. కర్తవ్య నిర్వహణకు మన భావజాలం వ్యాప్తి చెందాలన్నారు. ఉపాధ్యాయులు ముఖ్యంగా దీనిని గమనించాలన్నారు. 2047 డాక్యుమెంట్‌లో విద్యను బలోపేతం చేయడం కానీ ఖాళీలను భర్తీ చేయడం కానీ లేవన్నారు. ఈ రెండు రాజకీయ పార్టీలే మనకు గతి అనే భ్రమను వీడాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఈ ప్రభుత్వం 24 వేల స్కూళ్లను ఏకో ఉపాధ్యాయ పాఠశాలలుగా మార్చాలని ప్రయత్నాలు చేస్తుందని దానిని తిప్పికొట్టేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రైవేటు విద్యను, ప్రైవేటు వైద్యాన్ని మధ్యతరగతి ప్రజలు సైతం అంగీకరించే విధంగా ప్రభుత్వాలు సఫలం అయ్యాయన్నారు. గుంతలు పూడ్చడానికి అవకాశం ఇచ్చామని కాంట్రాక్టర్లకు చెప్పి టోల్ ప్లాజాలను ఏర్పాటు చేసి ప్రజల వద్ద నుంచి ముక్కు పిండి సొమ్ము వసూలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయం చేయడం శోచనీయమన్నారు. వచ్చే ఐదారేళ్లలో ప్రభుత్వ విద్యారంగం మరింతగా తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కోబోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మీ పిల్లల భవిష్యత్తు బాధ్యత మాది అని తల్లిదండ్రులకు హామీ ఇవ్వాలని, సమాజంలోనూ, సంఘంలోనూ ఐక్యతను తీసుకురావడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రాబోవు గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న మన పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

గురువు ద్వారా సమాజ మార్పు : కలెక్టర్ షణ్మోహన్

సమాజంలో ఏదైనా మార్పు రావాలంటే గురువుల ద్వారా మాత్రమే సాధ్యమని కలెక్టర్ షణ్మోహన్ సగిలి పేర్కొన్నారు. ఉపాధ్యాయులందరూ సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. తమ తల్లిదండ్రులు కూడా కడప జిల్లాలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఎస్ ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో విద్యారంగం ప్రపంచ బ్యాంకు కనుసన్నల్లో నడుస్తూ, శరవేగంగా కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ జరుగుతూ పేద వర్గాలకు విద్య దూరమయ్యే ప్రమాద పరిస్థితులు ఏర్పడబోతున్నాయని విద్యారంగాన్ని కాపాడడానికి ప్రతి ఉపాధ్యాయుడు నడుం కట్టాలన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో 24 వేల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు సింగిల్ టీచర్ పాఠశాలలుగా మారబోతున్నాయని వివరించారు. కేంద్రం తెచ్చిన నూతన విద్యా చట్టం-2020 వ్యాపారానికి అనువుగా మారిందన్నారు. 16వ విద్యా మహాసభల్లో రాష్ట్ర యూటీఎఫ్ సభ్యత్వం 80,000 ఉండగా ఇవాళ 17వ మహాసభలకు లక్ష పై దాటిందని అన్నారు. ఉపాధ్యక్షుడు కే సురేష్‌కుమార్, ఎస్ కుసుమకుమారి, రాష్ట్ర కార్యదర్శులు ఎన్ అరుణకుమారి, వి శ్రీలక్ష్మి, బి సుభాషిణి, ఎస్ కిషోర్‌కుమార్, రెడ్డి మోహన్‌రావు, టి అన్నారాం, ఎస్ జ్యోతి బస్సు, కాకినాడ జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే నరేష్, పి చక్రవర్తి, యూటీఎఫ్ కృషి రాష్ట్ర పత్రికా బాధ్యులు ఐ ప్రసాదరావు, చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాండిచ్చేరి ఎల్జీకి ఘన స్వాగతం



ఎయిర్‌పోర్టులో ఎల్జీ కైలాసనాథన్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ప్రశాంతి

మధురపూడి: పాండిచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) కె. కైలాస్‌నాథన్ మంగళవారం మధురపూడిలోని రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వచ్చారు. ఆయనకు కలెక్టర్ పి. ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహకిషోర్, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు, ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ సాదర స్వాగతం పలికారు. జిల్లాలో 3 రోజుల పర్యటనలో భాగంగా ఆయన మధురపూడి వచ్చారు. ఇక్కడి నుంచి ఆయన కొవ్వూరు వెళ్లారు. రాత్రి కొవ్వూరులోనే బసచేస్తారు. బుధవారం అక్కడి నుంచి యానాంలో జరిగే 21 యానాం పీపుల్‌కల్చర్ ఫెస్టివల్ 2025 వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్తారు. ఈనెల 9 వతేదీన యానాం నుంచి మధుర పూడి విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాద్ వెళ్తారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ తహసీల్దార్ వి.సుస్వాగతం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రపంచ తెలుగు మహాసభలు



ప్రపంచ తెలుగు మహాసభల ముఖద్వారం



ప్రధాన వేదిక వద్ద ఏర్పాట్లు

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో బుధ, గురువారాలలో రెండు రోజులపాటు జరుగనున్న ప్రపంచ తెలుగు మహాసభలను వైభవోపేతంగా నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లు పూర్తికావొచ్చాయి. ఆద్యంతం తెలుగుదనంతో యూనివర్సిటీ ప్రాంగణం కొత్త శోభతో కళకళలాడుతోంది. గత ఏడాది ఇదే ప్రాంగణంలో మూడు రోజులు జరిగిన అంతర్జాతీయ తెలుగు మహాసభల స్ఫూర్తితో యూనివర్సిటీ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) సారథ్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించదలచారు. తెలుగు భాష సంస్కృతి, సాహిత్యాలను కాపాడుతూ, భావితరాలకు మాతృ భాషను పదిలంగా అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

మూడు ప్రధాన వేదికలు

ఆదికవి నన్నయ భట్టు, రాజరాజనరేంద్రుడు, కందుకూరి వీరేశలింగం పేరిట మూడు ప్రధాన వేదికలను ఆకర్షణీయంగా తయారు చేశారు. కార్యక్రమాలను విజయవంతం చేసే విధంగా 18 కమిటీలను ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం 8.30 గంటలకు గణపతి ఆరాధనతో ప్రారంభమయ్యే ఈ ప్రపంచ తెలుగు మహాసభలలో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, ఆయోధ్య రాముని నృత్య రూపకం, నెమలి నృత్యం వంటి పలు కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. 10 గంటలకు ప్రారంభోత్సవ సభతోపాటు ఈరెండు రోజుల వేడుకలలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణలతోపాటు పలువురు కేంద్రం మంత్రులు, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి గవర్నర్లు, మంత్రులు, స్పీకర్లు, డిప్యూటీ స్పీకర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సినీ నటులు, న్యాయకోవిదులు, భాషా పండితులు, రచయితలు పాల్గొననున్నారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా ప్రొఫెసర్ సోలోమన్ డార్విన్, జాన్స్‌హాప్కిన్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వాడ్రేవు కె.రాజు, పద్మభూషణ్ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆధ్యాత్మికవేత్త పి. బంగారయ్యశర్మ కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకానున్నారు. ఈ రెండు రోజులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు 560 మంది కవుల కవితా గోష్ఠులు జరుగనున్నాయి.

హత్యకు దారి తీసిన అనుమానం

భార్యతో వివాహేతర సంబంధం ఉందని స్నేహితుడిని చంపిన వైనం



మృతి చెందిన సత్తి శివన్న రత్నం(ఫైలో)

కె.గంగవరం: వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో తన స్నేహితుడి పీక కోసి చంపి పోలీసులకు లొంగిపోయిన వ్యక్తి ఉదంతమిది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కె.గంగవరం మండలం కూళ్ల గ్రామానికి చెందిన మంచాల సురేష్, సత్తి శివన్న రత్నం(శివ) ఇద్దరూ స్నేహితులు. ఇద్దరూ కలిసి స్థానికంగానే తాపీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. సాధారణంగా రోజూ ఇద్దరు కలసి ఒకే చోట పని చేసుకుంటారు. సోమవారం కూడా తాపీ పనికి కలిసే వెళ్లి తిరిగి వస్తూ పామర్రు గ్రామంలో మద్యం కొనుగోలు చేసి కూళ్ల గ్రామం దగ్గరలో ఇద్దరూ మద్యం సేవించారు. మద్యం సేవించిన అనంతరం ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. సత్తి శివన్న రత్నం(32)కు సురేష్ భార్యతో వివాహేతర సంబంధం ఉందనే అంశంపై వారిద్దరూ వాగ్వాదానికి దిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. పక్కనే ఉన్న పంట బోదెలోనికి శివన్న రత్నాన్ని తోసి సురేష్ తన కూడా తెచ్చుకున్న బ్లేడుతో పీక కోసి బురదలో తొక్కేశాడు. అనంతరం సురేష్ కె.గంగవరం పోలీసులకు లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న స్థానికులు, కుటుంబ సభ్యులు ఘటన జరిగిన ప్రదేశానికి వెళ్లి బురదలో ఉన్న శివను పామర్రులో గల పీహెచ్‌సీకి తరలించారు. అయితే అప్పటికే శివ మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు

మండల పరిధిలోని కూళ్లలో జరిగిన హత్య ఘటన తెలుసుకున్న పోలీసు ఉన్నతాధికారులు ఘటనా ప్రదేశాన్ని మంగళవారం పరిశీలించి స్థానికుల నుంచి వివరాల అడిగి తెలుసుకున్నారు. రామచంద్రపురం ఇన్‌చార్జి డీఎస్పీ సీఎస్ఆర్‌కే ప్రసాద్, ఇన్‌చార్జి సీఐ దొరరాజు, కె.గంగవరం ఎస్సై జానీ బాషా మాట్లాడుతూ జరిగిన ఘటనపై కేసు నమోదు చేశామన్నారు. సురేష్ భార్యతో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో శివను చంపాడని పేర్కొన్నారు. దీనిపై నిందితుడిని సమగ్రంగా విచారించి కోర్టుకు తరలిస్తామని చెప్పారు.

కీచక పండితునిపై కేసు నమోదు

మందపల్లి శనైశ్చరాలయంలో భక్తురాలి పట్ల అసభ్య ప్రవర్తన

కొత్తపేట: ఒక యువతికి శనిదోష నివారణకు పూజాధికాలు అనంతరం ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పండితునిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జీ సురేంద్ర తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి మంగళవారం రాత్రి ఎస్ఐ విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమహేంద్రవరం రూరల్ శానిటోరియం, కోలమూరు గ్రామానికి చెందిన యువతి తన వివాహం, ఉద్యోగం విషయంలో ఇబ్బందులు పడుతోంది. తనకు తెలిసిన వారి ద్వారా జంగారెడ్డిగూడెం లలితాదేవి ఆలయంలో అర్చకత్వం చేస్తున్న కొత్తపేట మండలం మందపల్లి సమీప ఏనుగులమహల్ గ్రామానికి చెందిన పండు పంతులు అనే శర్మను సంప్రదించింది. అతను జాతకం చూసి నీకు నాగదోషం ఉంది. హోమం చేయాలి అని చెప్పి మొదట గత నెల 29న జంగారెడ్డిగూడెం లలితాదేవి ఆలయానికి రమ్మన్నాడు. తరువాత కాల్ చేసి 31న రావులపాలెం దగ్గర మందపల్లి శనైశ్చరస్వామి ఆలయంలో హోమం జరిపిస్తే ఇంకా మంచి జరుగుతుందని చెప్పి అక్కడికి రమ్మన్నాడు. అతను చెప్పిన ప్రకారం 31న మధ్యాహ్నం మందపల్లి శనైశ్చర ఆలయానికి రాగా హోమం చేయించాడు. ఆ సమయంలో ఆమె చేతులు పట్టుకుని చేయిస్తుండగా ఆమె ఇబ్బంది పడుతుంటే ఈ పూజ ఇలానే చేయించాలన్నాడు. పూజ పూర్తి అయ్యాక స్నానం చేయాలని చెప్పడంతో ఆమె స్నానం చేయడానికి బాతరూమ్‌లోకి వెళ్లగా లోనికి చొరబడి అసభ్యంగా ప్రవర్తించాడు. దాంతో అరచి అతనిని బయటకు తోసేసింది. షాక్‌కు గురై భయంతో తిరిగి రాజమహేంద్రవరం వెళ్లిపోయింది. అక్కడ దిశ పోలీస్‌స్టేషన్‌కు, జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మొర పెట్టుకున్నా ఎవరూ సహకరించలేదు. దాంతో కొత్తపేట పోలీస్ స్టేషన్‌కి వచ్చి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేంద్ర తెలిపారు.

కొడుకు చనిపోయాడనే బెంగతో..

ప్రాణాలు వదిలిన తండ్రి



తండ్రి రామకృష్ణ (ఫైల్)



కుమారుడు డానియేలు (ఫైల్)

నల్లజర్ల: అగ్నిప్రమాదంలో కొడుకు సజీవదహనమయ్యాడనే మనస్తాపంతో ఓ తండ్రి ప్రాణాలు వదిలిన సంఘటన తూర్పు గోదావరి జిల్లాలోని మండల కేంద్రమైన నల్లజర్ల కోనేరు కాలనీలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలివీ.. కాలనీకి చెందిన నామాల రామకృష్ణ (64) భార్య రామలక్ష్మి పదిహేనేళ్ల క్రితమే మరణించింది. ఆ తర్వాత పెద్ద కొడుకు రాజు, చిన్న కొడుకు డానియేలు(28)తో కలసి అతడు చిన్న తాటాకింట్లో నివాసముంటున్నాడు. పెద్ద కొడుకు రాజు చనిపోవడంతో భార్య మూడేళ్ల కుమారుడు శ్రీనును వదిలేసి, మరొకరిని పెళ్లి చేసుకొని వెళ్లిపోయింది. అప్పటి నుంచీ రాజు కొడుకు శ్రీను, వికలాంగుడైన డానియేలు, రామకృష్ణ కలసి ఉంటున్నారు. ఈ నేపథ్యంలో వారుంటున్న తాటాకింటికి ఆదివారం అర్ధరాత్రి నిప్పంటుకొని డానియేలు సజీవ దహనమయ్యాడు. తండ్రి రామకృష్ణ ప్రమాదం నుంచి బయట పడ్డాడు. కానీ, ఉన్న ఒక్కగానొక్క కొడుకూ మరణించాడనే బెంగతో మంగళవారం ప్రాణాలు విడిచాడు. ఈ సంఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది.

ఏకాకియై..

ఇప్పుడా ఇంట్లో రామకృష్ణ పెద్ద కొడుకు కుమారుడు 13 సంవత్సరాల రాజు ఒక్కడే ఏకాకిగా మిగిలాడు. చిన్న వయస్సులోనే పుట్టెడు కష్టాలు ఆ బాలుడిని చుట్టుముట్టాయి. ఒకవైపు ఉన్న ఇల్లు కాలిపోయింది. మరోవైపు చిన్నాన్నకు తలకొరివి పెట్టాడనే కారణంతో చుట్టుపక్కల వారెవరూ అతడిని తమ ఇళ్లకు రానివ్వలేదు. దీంతో సోమవారం రాత్రంతా ఆ బాలుడు చలిలోనే షామియానాలో వణుకుతూ గడిపాడు. మళ్లీ మంగళవారం తాత చనిపోవడంతో ఆ బాలుడిని మరింతగా కష్టాలు చుట్టుముట్టాయి.

కొబ్బరి పరిశ్రమల స్థాపనపై అధ్యయనం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

సాక్షి, అమలాపురం: కొబ్బరి ముడి సరుకు ఆధారంగా విలువ ఆధారిత పరిశ్రమలు కేరళ, తమిళనాడు మాదిరిగా స్థాపించేందుకు ఉద్యాన, పరిశ్రమల శాఖ అధికారులు అధ్యయనం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా పరిశ్రమలు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కమిటీ సభ్యులతో నిర్వహించారు. వివిధ పరిశ్రమలకు రాయితీల కల్పన, ప్రధానమంత్రి ఉపాధి కల్పన, సింగిల్ విండో విధానంలో అనుమతుల మంజూరు, కొత్త పరిశ్రమల పాలసీ 2024– 2029, క్వాయర్ పరిశ్రమలపై ఫోకస్, రోడ్ల నిర్మాణానికి సంబంధించి కొబ్బరి ఆధారిత జియో టెక్స్ మ్యాట్ల తయారీ, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన, ఎంఎస్ఎంఈ యూనిట్లు స్థాపన వంటి అంశాలపై కమిటీ సభ్యులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కొబ్బరి ముడిసరకు ఆధారంగా వర్జిన్ కోకోనట్ కొబ్బరి వాటర్ ద్వారా పౌడర్ తయారీ, కోకో పిట్ తయారీ వంటి విలువ ఆధారిత రంగాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని సూచించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకే పీ ప్రసాద్, సహాయకులు శివరాం ప్రసాద్, ఉద్యాన అధికారి బీవీ రమణ, డిఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, డ్వామా పీడీ మధుసూదన్, సిడ్బి ప్రోగ్రాం మేనేజర్ శ్రీనివాసరావు, ఎల్‌డీఎం కేశవ వర్మ, కాయర్ బోర్డ్ ప్రతినిధి వినోద్‌కుమార్, కోకోనట్ బోర్డ్ ప్రతినిధి కుమార్ జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో 30 ఏళ్ల జైలు

పిఠాపురం: ఇద్దరు బాలికలను వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై పోక్సో కేసు రుజువు కావడంతో 30 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 2019లో పిఠాపురం పట్టణం జగ్గయ్యచెరువుకు చెందిన కరగపాటి వీర వెంకటసత్యనారాయణ ఇద్దరు కుమార్తెలను జగ్గయ్యచెరువుకు చెందిన భగవతి హేమంత్‌కుమార్ రెండేళ్ల నుంచి ప్రేమ పేరుతో వంచించాడు. వివాహం చేసుకొంటానని చెప్పి ఒకరికి తెలియకుండా మరొకరిని మోసగించాడు. చివరకు పెళ్లి చేసుకోకుండా మోసం చేయడంతో బాధితుల తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి పిఠాపురం టౌన్ పోలీసు స్టేషన్ ఎస్ఐ శోభన్‌కుమార్ కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా అప్పటి డీఎస్పీ దర్యాప్తు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. కేసును పిఠాపురం సీఐ ఎ.శ్రీనువాసు ఎస్సై.మణికుమార్ కోర్టు హెడ్ కానిస్టేబుల్ కిశోర్ సాక్షులను సకాలంలో కోర్టులో ప్రవేశపెట్టారు. వాదోపవాదాల అనంతరం నిందితుడిపై మోపిన నేరం రుజువు కావడంతో కాకినాడ జిల్లా జడ్జి శ్రీదేవి ముద్దాయి భగవతి హేమంత్ కుమార్‌కు పై విధంగా శిక్ష విధించారు. బాధిత బాలికలకు రూ.2 లక్షల చొప్పున నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ గంటి రత్నబాబు వాదనలను వినిపించారు.

డాబా ఇల్లు దగ్ధం


రూ.6 లక్షల ఆస్తి నష్టం



అమలాపురంలో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్‌తో డాబా ఇంట్లో చెలరేగిన మంటలు

అమలాపురం టౌన్: స్థానిక ముమ్మిడివరం గేటు సెంటర్ సమీపంలో ఓ డాబా ఇంటి పై అంతస్తులో సోమవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన అగ్ని ప్రమాదంలో ఆ ఇంట్లో విలువైన వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ వల్ల సంభవించిన ఈ ప్రమాదంలో సీలింగ్, ఏసీలు, కర్టెన్లు అంటుకొని మొత్తం గృహ సామగ్రి దగ్ధమైంది. ఆ ఇంటి యాజమాని పచ్చిమాల జోత్స్న ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30 గంటలకు తిరిగి ఇంటికి వచ్చి తలుపులు తీసి మెయిన్ స్విచ్ ఆన్ చేయగానే ఒక్కసారే మంటలు చెలరేగి క్షణాల్లో ఇంటిని వ్యాపించాయి. కుటుంబ సభ్యులంతా కట్టుబట్టలతో బయటపడ్డారు. ప్రమాదంలో రూ.6 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్టు అగ్ని మాపక సిబ్బంది ప్రాథమిక అంచనా వేసింది. తక్షణమే అమలాపురం అగ్నిమాపక దళాధికారి కె.మురళీ కొండబాబు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పి వేశారు.

మరణంలోనూ వీడని భార్యాభర్తల అనుబంధం



కె.గంగవరం: భర్త మృతిని తట్టుకోలేక నీ వెంటే నేనంటూ భార్య కూడా మృతి చెందిన సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం అముజూరు గ్రామంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనతో ఆ కుటుంబంలో పెను విషాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నాళం సూర్య ప్రకాశరావు (సూరిబాబు) (54) పాణింగపల్లి గ్రామంలో కిరాణా షాపు నిర్వహించుకుంటూ భార్య బంగారమ్మ, ఇద్దరు కుమారులతో జీవనం సాగిస్తున్నారు. సూరిబాబు ఈ నెల ఒకటో తేదీన అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందారు. భర్త మృతితో తీరని సూర్య వెంకట భాగ్యలక్ష్మి (బంగారమ్మ) (46) తీరని మనోవేదనకు గురైంది. ఆయన లేని జీవితం ఇంక అనవసరమని అనుకుందో ఏమో కానీ సోమవారం రాత్రి ఆ విచారంతోనే నిద్రకు ఉపక్రమించింది. మంగళవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆకస్మికంగా మృతి చెందింది. సరిగ్గా ఇదే రోజు సూరిబాబు చిన్న కార్యం జరగాల్సి ఉంది. ఇంతలోనే బంగారమ్మ మృతి చెందింది. వారం రోజుల వ్యవధిలోనే దంపతులిద్దరూ మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.


మొక్కలు నాటక ముందు...


మొక్కలు నాటిన తర్వాత...





● అదర్ సైడ్


● శ్వేత

ఆమే వనమై...

ఎస్.పి గారి డ్యూటీ నేరాలను అరికట్టడం. భూమి మీద చెట్టు చేమా లేకుండా పోయేలా మనిషి వహిస్తున్న నిర్లక్ష్యాన్ని మించిన నేరం ఉంటుందా? దానినీ అరి కట్టాలి కదా. కామారెడ్డి జిల్లా ఎస్పీగా శ్వేత పనిచేస్తున్న కాలంలో ఒక హరిత వనాన్ని పెంచడం తన కర్తవ్యం అనుకున్నారు. ఆరు ఎకరాల్లో ఎన్నో మొక్కలు నాటించారు. ఇప్పుడది అడవిని తలపిస్తోంది. హరిత రక్షక వనంగా నామకరణం చేసుకుంది.

హరితహారం స్ఫూర్తితో తన వంతు బాధ్యతగా మొక్కలను నాటడమే కాదు వాటిని సంరక్షించాలనే లక్ష్యంతో రంగంలోకి దిగారు అప్పటి కామారెడ్డి ఎస్పీ శ్వేత. కామారెడ్డిలో ఆరు ఎకరాల స్థలంలో 80 రకాలైనవి ఎన్నో మొక్కలు నాటించారు. మొక్కలు నాటడమే కాదు వాటిని కాపాడేందుకు ఆమెతో పాటు పోలీసు సిబ్బంది నిరంతరం శ్రమించారు. ఫలితంగా ఇప్పుడు అక్కడ అడవిని తలపించే విధంగా చెట్లు పెరిగి పెద్దవయ్యాయి. మూడేళ్ల కాలంలో ప్రతీ రోజూ ఎస్పీ శ్వేత అక్కడికి వెళ్లేవారు. జరుగుతున్న పనులను పర్యవేక్షించేవారు. ప్రతీ రోజూ వాకింగ్, రన్నింగ్ అక్కడే చేసేవారు. ఈ వనానికి 'హరిత రక్షక వనం' అని నామకరణం చేశారు.

ఎనభై రకాల మొక్కలు...

స్థానికంగా పెరిగే అటవీ వృక్ష జాతులకు సంబంధించి దాదాపు 80 రకాల మొక్కలు నాటారు శ్వేత. రామ సీతాఫలం, బాదమ్, శ్రీగంధం, టేకు, ఖర్జూరం, వేప, పనస, నేరేడు, చింత, దానిమ్మ, జామ, ఈత, మేడి, మునగ, నిమ్మ, ఉసిరి, వెలగ, కుంకుడు, కదంబం, నల్లజీడి, రాచఉసిరి, జిట్రేగి... మొదలైన రకాలకు సంబంధించి ఎన్నో మొక్కలు నాటారు.

ప్రతీ మొక్కకు నీరందించడానికి డ్రిప్ ఏర్పాటు చేశారు. అక్కడ రెండు బోర్లు తవ్వించి వాటి ద్వారా నీటిని అందిస్తున్నారు. 'హరిత రక్షక వనం'లో రెండు నీటి గుంతలు తవ్వించారు. అందులో నీరు నిల్వ ఉండేలా వర్షపు నీరు ఆ గుంతలో నిండేలా ఏర్పాటు చేశారు. పై భాగాన ఉన్న గుంతలో పది అడుగుల మేర నీటి నిల్వ ఉంది. అందులో చేప పిల్లలను పెంచుతున్నారు. నీటిని నిల్వ చేయడం మూలంగా బోరుబావుల్లో భూగర్భ జల మట్టానికి ఇబ్బంది లేకుండాపోయింది.



ఆ శ్రమ వృథా పోలేదు...

'హరిత రక్షక వనం'లో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు శ్రమించారు. ఆ మొక్కలను తమ ఇంటి పెరట్లో నాటిన మొక్కలలాగే చూసుకున్నారు. మొక్కల చుట్టు పెరిగే గడ్డిని తొలగించడం, నీరు మొక్కకు చేరుతుందా లేదా చూసుకోవడం, పనికి రాని చెత్తను తొలగించడంలాంటి పనులెన్నో చేసేవారు. పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు జిల్లా పోలీసు కార్యాలయానికి వస్తే వారితో మొక్కలు నాటించేవారు. ఆ చెట్లకు వారి పేర్లతో నేమ్‌ప్లేట్లు ఏర్పాటు చేశారు.

'చెట్టు అంటే....భూమాత రాసిన కవిత్వం' అనేది భావుకతతో కూడిన మాటే కాదు బాధ్యతను గుర్తుకు తెచ్చే మాట.

వృత్తిబాధ్యత, సామాజిక బాధ్యతలను సమన్వయం చేసుకుంటూ పచ్చటి వనాన్ని సృష్టించడం కష్టమేమీ కాదు అని నిరూపిస్తున్నారు శ్వేత లాంటి అధికారులు.

– సేపూరి వేణుగోపాలచారి, సాక్షి, కామారెడ్డి

మానసిక స్థైర్యాన్ని ఇచ్చారు

శాంతిభద్రతలకు సంబంధించిన వ్యవహారాల్లో బిజీగా ఉంటూనే రకరకాల సామాజిక అంశాలపై స్పందించేవారు శ్వేత. కరోనా కాలంలో పోలీసు సిబ్బందిలో మానసిక స్థైర్యాన్ని కలిగించి ఎంతో మందికి అండగా నిలిచారు. నిరుద్యోగ యువతకు పోలీసు ఉద్యోగాల కోసం రాత పరీక్షలకు సంబంధించి శిక్షణా తరగతులు నిర్వహించారు. శారీరక దారుఢ్య పరీక్షలకు శిక్షణ ఇప్పించారు.

అమ్మలాంటి చెట్టు

కామారెడ్డి జిల్లా ఏర్పాటైన తరువాత కలెక్టరేట్, పోలీస్ కార్యాలయాల కోసం ఎంపిక చేసిన స్థలం దగ్గరికి వెళ్ళినప్పుడు ఈ స్థలం కనిపించి నాకు వనం పెంచాలన్న ఆలోచన వచ్చింది. పెద్ద పెద్ద భవనాలు నిర్మించినపుడు అక్కడ వాతావరణం మారిపోతుంది. చల్లబడాలంటే సమాంతరంగా చెట్లు పెంచాలి. అందుకే 2017 దసరా రోజు నేను, అప్పటి కలెక్టర్ సత్యనారాయణ గారు ఇక్కడ మొక్కలు నాటాం. కామారెడ్డికి పోలీస్ ఉన్నతాధికారులు ఎవరు వచ్చినా వాళ్ళతో అక్కడ మొక్కలు నాటించాను. నాటడంతో పాటు మా పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ వాటి సంరక్షణకు నిరంతరం శ్రమించారు. అక్కడి ఉసిరి చెట్టు దగ్గర మా అమ్మ ప్రతీ కార్తీక పౌర్ణమి రోజున పూజలు చేసి అందరికీ భోజనాలు పెట్టేవాళ్ళు. నేను బదిలీ అయినా ఒక అమ్మలా ఆ చెట్టు గుర్తుకొస్తూ ఉంటుంది.

– ఎన్. శ్వేత, ఐపీఎస్

● నృత్యోద్యమం



లండన్‌లో శివతాండవం

నాట్యం అనేది ఆహ్లాదానికే కాదు మానసిక వికాసానికి కూడా అనుకుంటే... నాట్యం అంటే సంతోషమే కాదు మానసిక స్థైర్యం కూడా అనుకుంటే... నాట్యం అనేది ఆనందతరంగమే కాదు పర్యావరణహిత చైతన్యం అంటే గుర్తుకు వచ్చే పేరు.... సోహిని రాయ్ చౌదరి....

సోహిని రాయ్ చౌదరి తండ్రి సుబ్రతో రాయ్ సితార్ విద్వాంసుడు. తల్లి ఉమా రాయ్ చౌదరి శిల్పి. కోల్‌కత్తాలోని వారి ఇంటిలో ఎప్పుడూ కళాత్మక వాతావరణం ఉండేది. నాలుగు సంవత్సరాల వయసులోనే నృత్యకారిణిగా కాళ్లకు గజ్జె కట్టింది సోహిని రాయ్ చౌదరి. భరతనాట్యం నుంచి మోహినియాట్టం వరకు ఎన్నో నృత్యాలలో ప్రావీణ్యం సాధించింది.

'మన వైదిక సిద్ధాంతాలు, పురాణాలు, ఇతిహాసాలు అన్నీ మానవతావాదం, మంచి గురించి చాటి చెప్పాయి. కోవిడ్, ఆర్థిక మాంద్యం, యుద్ధంలాంటి అనిశ్చిత కాలాల్లో అవి మనకు ధైర్యాన్ని ఇస్తాయి. ఇతరులకు సహాయపడేలా ప్రేరణ ఇస్తాయి. జీవితానికి సానుకూల దృక్పథాన్ని ఇచ్చే శక్తి మన పవిత్ర తత్వాలలో ఉంది' అంటుంది సోహిని.

వాతావరణ మార్పులపై ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ఎన్నో సదస్సులలో సోహిని రాయ్ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

'వేదమంత్రాలతో కూడిన నా నృత్యప్రదర్శన ప్రకృతి గురించి, మన జీవితాల్లో దాని ప్రాముఖ్యత గురించి తెలియజేసేలా ఉంటుంది. పశుపతిగా శివుడు, అడవులు, జంతువులు, పర్యావరణాన్ని పరిరక్షించేవాడు. ప్రకృతిని మనుషులు ఎలా దుర్వినియోగం చేస్తున్నారో, విధ్వంసం సృష్టిస్తున్నారో చెప్పడానికి, ప్రకృతితో సన్నిహిత సంబంధాల కోసం శివతాండవం చేస్తున్నాను' అంటున్న సోహిని రాయ్ 'గ్లోబల్ ఉమెన్ ఆఫ్ ది ఇయర్' అవార్డ్ కూడా అందుకుంది.

ప్రపంచవ్యాప్తంగా భారతీయ కళలు, సంస్కృతికి సోహిని రాయ్ చౌదరి అంబాసిడర్‌గా మారింది. యూకేలోని ఇండియన్ హైకమిషన్‌కు చెందిన నెహ్రూ సెంటర్‌లో సోహిని చేసిన శివతాండవం ప్రేక్షకులను ఆకట్టుకుంది. శివతాండవంతో పాటు శివుడి గురించి రుషి దాస్ గుప్తా చెప్పిన విలువైన మాటలను వినిపించింది.

మార్కండేయ పురాణం, శివపురాణాలలో నుంచి ఒక కథను ఎంపిక చేసుకొని దాన్ని నృత్యరూపకంగా మలుచుకుంది. లండన్ తరువాత అమెరికా, రష్యా, జర్మనీ, స్పెయిన్... మొదలైన దేశాల్లోనూ ప్రదర్శనలు ఇవ్వబోతోంది.


'డ్యాన్సింగ్ విత్ ది గాడ్స్' పేరుతో తొలి పుస్తకం రాసిన సోహిని రాయ్‌కు రచనలు చేయడం అంటే కూడా ఎంతో ఇష్టం. ఆమె రచనల్లో మహిళా సాధికారత నుంచి రంగస్థలం వరకు, నృత్యోద్యమం నుంచి దేవదాసీల దుస్థితి వరకు ఎన్నో అంశాలు ఉంటాయి.

శక్తివాదాన్ని ప్రధానంగా చేసుకొని ఎన్నో రచనలు చేసింది. 'ఇండియన్ స్టేజ్ స్టోరీస్: కనెక్టింగ్ సివిలైజేషన్స్' పేరుతో సోహినిరాయ్ రాసిన పుస్తకం భారతీయ రంగస్థలం ఆత్మను పట్టిస్తుంది. ఈ పుస్తకం ద్వారా మన నాగరికతలోని గొప్ప సాంస్కృతిక, సంప్రదాయల గురించి తెలియజేసే ప్రయత్నం చేసింది. యూరప్‌లోని పద్దెనిమిది యూనివర్శిటీలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేసింది.


● సోహిని రాయ్ చౌదరి

'సూఫీ తత్వం, రూమీ కవిత్వం, ఠాగూరు మానవతావాదంలో నాకు మహిళాసాధికారత కనిపిస్తుంది' అంటున్న సోహినిరాయ్ చౌదరి తన నృత్య కళను సామాజిక ప్రయోజనం కోసం ఉపయోగిస్తోంది.

● ముగ్గు ముచ్చట




నల్లబెల్లి మనోజ్ఞ
మంచిర్యాల

17 చుక్కలు, 3 వరుసలు
3 వచ్చే వరకు, సరి చుక్కలు




సి. పుష్కల,
శ్రీనగర్ కాలనీ, కడప

17 చుక్కలు, 7 వచ్చేవరకు
మధ్య చుక్క



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

● గర్భసంచి

తొలగించడమే పరిష్కారమా?!

'ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సెన్సెస్, జాతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ సంస్థ'కు చెందిన శాస్త్రవేత్తలు తాజాగా జర్నల్ ఆఫ్ మెడికల్ ఎవిడెన్స్ ద్వారా ఓ విషయాన్ని వెల్లడించారు. దేశంలోని 25 నుంచి 49 ఏళ్ల మధ్య వ్యవసాయ కూలీలుగా ఉన్న గ్రామీణ మహిళల్లో 32 శాతం గర్భసంచి తొలగింపు (హిస్టరెక్టమీ) శస్త్ర చికిత్సలు చేయించుకుంటున్నారని, ఈ శస్త్ర చికిత్సలు ప్రభుత్వ బీమా పథకాల ద్వారానే జరుగుతున్నాయని వెల్లడి అయింది. గర్భసంచి తొలగింపు శస్త్ర చికిత్సలవైపు గ్రామీణ మహిళలు ఎందుకు మొగ్గు చూపుతున్నారు?! ఏ అంశాలు వీరిని ప్రేరేపిస్తున్నాయి?! గర్భసంచి తొలగిస్తే వచ్చే నష్టమేమిటి?! అవగాహన అవసరం...

దేశంలో బిహార్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ.. రాష్ట్రాల్లోని గ్రామాల్లో హిస్టరెక్టమీ రేటు పెరగడం ఆందోళన కలిగిస్తోందని పరిశోధకులు చెబుతున్నారు. అవగాహన లోపమే ఇందుకు ప్రధాన కారణం అంటున్నారు స్త్రీ వైద్య నిపుణులు. వారు చెబుతున్న విషయాలేంటంటే..

ఖర్చుకు భయపడి...

● వ్యవసాయ కూలీలుగా ఉన్న మహిళల్లో వ్యక్తిగత శుభ్రత తక్కువ. దీనివల్ల గర్భసంచికి ఇన్ఫెక్షన్లు వస్తుంటాయి.

● పోషకాహార లోపం వల్ల రక్తహీనత, అధిక రక్తస్రావం, వైట్ డిశ్చార్జ్, ఇన్ఫెక్షన్లు, రుతు సమయంలో వచ్చే నొప్పులను ఇంటిలో పనుల కారణంగా భరిస్తున్నారు. అయితే గర్భసంచి వాపు, సిస్టులు అనగానే క్యాన్సర్ అని భయపడుతున్నారు.

● సమస్య తీవ్రం అయినప్పుడు హాస్పిటల్‌కు రావడం, త్వరగా నయం కాకపోవడంతో పదే పదే డాక్టర్ దగ్గరకు వెళ్లవలసి వస్తుందని, దీనివల్ల ఇంటి పనులు, కూలి పనులకు ఇబ్బందులు వస్తాయని, తమ వెంట వచ్చేవారి పని కూడా పోతుందని, టెస్టులకు, మందులకు అదనపు ఖర్చు అని.. 'గర్భసంచి తొలగించుకుంటే' ఈ చికాకులన్నీ పోతాయనే ఆలోచనకు వస్తున్నారు.

● శస్త్ర చికిత్సకు ప్రభుత్వం అందించే ఉచిత పథకాల కోసం వెతుకుతున్నారు.

● గర్భసంచి సమస్యలను వాయిదా వేసుకుంటూ కూలి పనులు ఎక్కువ ఉండని వేసవి కాలాన్ని ఆపరేషన్‌కు కేటాయించుకుంటున్నారు.

● త్వరగా పెళ్ళిళ్ల అవడం, పిల్లలు పుట్టడం, త్వరగా గర్భసంచి తొలగించుకోవడం అనేది గ్రామాల్లో కూలి పనులకు వెళ్లే వారిలో తరచూ కనిపిస్తోంది.

అత్యవసర అవగాహన

● శుభ్రతకు సంబంధించిన అవగాహన అత్యవసరం.

● అధిక రక్తస్రావం సమస్యలకు కూడా పరిష్కారాలు ఉన్నాయి. హార్మోన్లకు, బలానికి వాడే మందులను అందజేయాలి.

● తప్పనిసరై గర్భసంచి తొలగించుకున్నా సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే రకరకాల ఇతర సమస్యలు తలెత్తుతాయి. దీంతో మళ్లీ హాస్పిటల్‌కు వెళ్లాల్సి ఉంటుంది. మధుమేహం, బలహీనత, ఎముకల సమస్యలు... వీటన్నింటి పైనా అవగాహన కల్పించాలి.

ఆర్థికంగానే కాదు ఆరోగ్యంగా ఉండటమూ దేశ భవిష్యత్తుకు కొలమానమే. వ్యవసాయ కార్మికులుగా ఉన్న మహిళలు తరచూ పురుగు మందులకు గురి కావడం వల్ల కూడా అధిక రుతుస్రావాలు, ఫైబ్రాయిడ్లు, గర్భాశయ లోపాలు, జననేంద్రియ సమస్యలకు కూడా గురవుతున్నారని నివేదికలు తెలియజేస్తున్నాయి.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఏడాదికోసారి పాప్‌స్మియర్ టెస్ట్

గర్భసంచి తొలగించడం వల్ల అండాలు విడుదల కాక హార్మోన్ల పని తీరు దెబ్బతింటుంది. దీనివల్ల ఎముకలపై ప్రభావం పడి, త్వరగా కీళ్ల సమస్యలు వస్తాయి. చాలా మందిలో రకరకాల ఇన్ఫెక్షన్ల వల్ల గర్భసంచి వాపు వస్తుంది. ఫైబ్రాయిడ్స్, సిస్టులు వస్తుంటాయి. అయితే అవగాహన లేక క్యాన్సర్ వస్తుందేమో అనే భయంతో గర్భసంచి తీసేయమని కోరుతున్నారు. పాప్‌స్మియర్ స్క్రీనింగ్‌తో గర్భసంచి సమస్య ఏంటో ముందే తెలుసుకోవచ్చు. దానికి తగిన మందులు వాడితే సరిపోతుంది. 40 ఏళ్ల లోపు మహిళలకు గర్భసంచి తొలగించకపోవడమే మంచిది. హెల్త్ అవేర్‌నెస్ క్యాంప్స్, ఏడాదికోసారి పాప్ స్మియర్ టెస్టులు, కుటుంబం మొత్తానికి స్త్రీ ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చు.



– డాక్టర్ భానుప్రియ, గైనకాలజిస్ట్, గవర్నమెంట్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్, నిజామాబాద్



అడ్డంకిగా భావిస్తున్నారు

గ్రామీణ మహిళలు ఓవర్ బ్లీడింగ్, వైట్ డిశ్చార్జ్, ఇన్ఫెక్షన్స్ వంటి సమస్యలతో మా దగ్గరకు వస్తుంటారు. ఇలాంటప్పుడు టెస్టులు చేయించుకోవడం మందులు వాడటం, పదే పదే వైద్యులను సంప్రదించడం వారికి కష్టంగా మారుతుంది. అందుకు గర్భసంచి తొలగించుకోవడం మేలేమో అనే ఆలోచన చేస్తున్నారు. సాధారణంగా 50 ఏళ్లలో మెనోపాజ్ లక్షణాలు కనిపిస్తాయి. సర్జికల్‌గా వచ్చే మెనోపాజ్ వల్ల చెమటలు పట్టడం, అలసిపోవడం, చిరాకు, హాట్ ఫ్లషెస్.. అన్నీ ముప్పై ల్లోనే కనిపిస్తాయి.



– డాక్టర్ మనోరమ, మధిర, ఖమ్మం జిల్లా


లీగల్

నిరాశ పడద్దు... మీకు న్యాయం జరుగుతుంది

మా ఇంటి పక్కన వారు మా ఇంటికి ఆనుకొని ఎలాంటి అనుమతి లేకుండా వారి పెంట్‌హౌస్ కట్టుకుంటున్నారు. ఆ పెంట్‌హౌస్ కట్టడం వలన మా ఇంటిలోకి వెలుతురు రావడం ఆగిపోతుంది. వారు పెంట్ హౌస్ కట్టుకోవడానికి అనుమతి కూడా లేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే మా ఇల్లు మా ఇష్టం, నీ కెందుకు సమాధానం చెప్పాలి అని గొడవ పడుతున్నారు. కాలనీ అసోసియేషన్ వారు మాట్లాడినా లాభం లేకుండా పోయింది. ఏం చేయాలో సలహా ఇవ్వగలరు.

– పవన్ కుమార్, హైదరాబాద్

ముందుగా మీరు వ్యక్తిగతమైన వాగ్వాదానికి చోటు ఇవ్వకండి. అది సరైనది కాదు, దాని వల్ల వివాదం పెరుగుతుందే తప్ప తగ్గదు! ఎవరి ఇంటిలో వారు నిర్మాణాలు చేసుకోవచ్చు కానీ అది పక్కవారికి ఇబ్బంది కలగకుండా, పక్కవారి హక్కులకు భంగం కలగకుండా ఉండాలి. అంతేకాక, చట్టరీత్యా నిబంధనలకు లోబడి ఉండాలి. సరైన అనుమతి లేకుండా నిర్మించే ఎలాంటి కట్టడమైనా అక్రమ కట్టడంగానే పరిగణించబడుతుంది. చట్టరీత్యా చర్యలు తీసుకుంటే అలాంటి అక్రమ కట్టడాలను తొలగించాల్సి వస్తుంది. మీరు వెంటనే మునిసిపల్ అధికారులకు ఒక ఫిర్యాదు చేయండి. అందులో మీకు కలిగే నష్టం ఏమిటి, మీ పక్కింటి వారు చేస్తున్న అక్రమ నిర్మాణం ఏమిటి, ఎందుకని ఆ నిర్మాణాన్ని అక్రమ నిర్మాణం అని మీరు అంటున్నారు వంటి విషయాలను ప్రస్తావిస్తూ రాయండి. నేరుగా వెళ్తే అధికారులు మీ ఫిర్యాదు తీసుకోలేము అనటం సహజంగా చూస్తుంటాం. అందుకే రిజిస్టర్డ్ పోస్టు ద్వారా మీ ఫిర్యాదును పంపించవచ్చు. సరైన వ్యవధిలో అధికారులు చర్యలు తీసుకోకపోతే, మీరు హైకోర్టును కూడా ఆశ్రయించి మీ ఫిర్యాదు పై చర్యలు తీసుకోవాలి అని హైకోర్టు ఆర్డరు పొందవచ్చు. అలా చేయడం ద్వారా అధికారులు సదరు అక్రమ నిర్మాణాన్ని పరిశీలించి, నిజానిజాలు తేల్చిన తర్వాత తొలగించే చర్యలను చేపడతారు. అయితే, కోర్టు కేసులలో కొంత ఆలస్యం జరగవచ్చు. దానికి నిరాశ పడవలసిన అవసరం లేదు. చట్టరీత్యా మీకు న్యాయం జరుగుతుంది.



– శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.



కురుల చివరలు చిట్లుతుంటే...

చలికాలం చర్మ ఆరోగ్యాన్నే కాదు శిరోజాల సహజత్వాన్ని కాపాడుకోవాలి. లేదంటే వెంట్రుకలు పొడిబారడం, చిట్లడం, చుండ్రు సమస్య తలెత్తడం వంటివి చూస్తుంటాం. ఈ సమస్యకు పరిష్కారంగా...

● బ్యూటిప్స్

అలెవెరాతో కండిషనింగ్

షాంపులు, కాలుష్యం, గాలిలో తేమ తగ్గడం.. వంటి వాటి వల్ల ఈ కాలంలో వెంట్రుకలు త్వరగా పొడిబారడం, చిట్లడం వంటివి సహజంగా జరుగుతుంటాయి. వీటి వల్ల జుట్టు నిస్తేజంగా కనిపిస్తుంది. రసాయనాల గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేసిన తర్వాత అలోవెరా జెల్‌ను జుట్టుకు పట్టించాలి. 15–20 నిమిషాల తర్వాత నీటితో కడిగేయాలి. అలోవెరా రసం జుట్టుకు కావలసినంత కండిషన్ లభించేలా చేస్తుంది.

ఉసిరితో మృదుత్వం

ఉసిరి, మందారపువ్వులు మరిగించిన కొబ్బరినూనెతో మాడుకు, వెంట్రుకలకు రాసి, మర్దనా చేయాలి. మరుసటి రోజు ఉదయం తలస్నానం చేయాలి. ఈ విధంగా చేస్తే వెంట్రుకలు చిట్లడం సమస్య తగ్గుతుంది. కురుల మృదుత్వం పెరుగుతుంది.